భారత్‌తో దూకుడు వద్దు

విశ్వంభర, నేషనల్ బ్యూరో : పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ దాడులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్థాన్ .. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాలపై డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో దూకుడుగా వ్యవహరించవద్దని, దౌత్యమార్గాల్లోనే పరిష్కరించుకునేందుకు ప్రత్నించాలని ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు పాకిస్థాన్ ముస్లింలీగ్‌నవాజ్ చీఫ్, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సూచించినట్లు తెలిసింది. ఇందులో భాగంగా భారత్‌తో సంప్రదింపులు చేసేందుకు వ్యక్తిగతంగా నవాజ్ ప్రయత్నాలు చేస్తున్నట్లు స్థానిక మీడియా పేర్కొంది.భారత్‌పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు మరింత తీవ్రతరమవుతున్న వేళ పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ రెండురోజుల క్రితం కీలక సమావేశం ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి సైనిక ఉన్నతాధికారులు సహా అధికార పాకిస్థాన్ ముస్లింలీగ్‌నవాజ్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ హాజరయ్యారు. ప్రభుత్వంలో ఎటువంటి పదవీ లేకున్నా కేవలం అధికార పార్టీ అధ్యక్షుడి హోదాలో ఆయన ఆ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవాజ్ మాట్లాడుతూ.. భారత్‌తో దూకుడుగా వ్యవహరించవద్దని, ఉద్రిక్తతలను తగ్గించేందుకు దౌత్యపరంగా ప్రయత్నాలు చేయాలని సోదరుడు, పీఎం షెహబాజ్ షరీఫ్‌కు సూచించినట్లు తెలిసింది.ఇరుదేశాల మధ్య శాంతిని పునరుద్ధరించేందుకు అందుబాటులో ఉన్న అన్ని దౌత్యమార్గాలను వినియోగించుకోవాలని నవాజ్ షరీఫ్ చెప్పినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. భారత్‌తో దూకుడుగా వ్యవహరించడంపై నవాజ్ సుముఖంగా లేనట్లు పేర్కొంది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నాలు చేసేందుకు లండన్ నుంచి ఆయన వచ్చారని, ఇందుకోసం తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపింది. ఇదిలాఉంటే, 1999లో కార్గిల్ యుద్ధం జరిగిన సమయంలో నవాజ్ షరీఫ్ ప్రధానమంత్రిగా ఉన్నారు.

పహల్గాం దాడి అనంతరం నవాజ్ షరీఫ్‌తో ప్రధాని షెహబాజ్ భేటీ అయ్యారు. భారత్ తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా తన ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆయనకు వివరించారు. ఢిల్లీ తీరు వల్లే ఉద్రిక్తతలు పెరిగాయని చెప్పారు. నవాజ్ మాత్రం.. దూకుడుగా వ్యవహరించకుండా, భారత్‌తో శాంతి పునరుద్ధరణ కోసం అందుబాటులో ఉన్న అన్ని దౌత్య మార్గాలను వినియోగించుకోవాలని ప్రధానితో చెప్పినట్లు తెలిసింది.

పేదరికం వల్ల చదువుకోలేని పరిస్థితి రాకూడదు

విశ్వంభర, అనంతపురం: పేదరికం వల్ల ఎవరికీ చదువుకోలేని పరిస్థితి రాకూడదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అండదండలు లేక ఎంతో మంది యువత కూలీలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో హంద్రీనీవా పనులను పరిశీలించిన సీఎం.. అక్కడ జరుగుతున్న పనుల తీరును గమనించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. ''సమాజాన్ని ఆసరా చేసుకొని బాగుపడిన వారు ఆలోచించాలి. ఇంకా ఎంతోమంది పేదరికంలో ఉన్నారు. పేదవాళ్లను పైకి తీసుకొచ్చేందుకు తమ పరిధిలో చేయూత ఇవ్వాలి. కింద స్థాయిలో ఉన్న 20శాతం మందికి అండగా నిలుద్దాం. సూచనలు, సలహాలే కాదు.. అవసరమైతే కాస్త డబ్బు ఖర్చు చేద్దాం. ఆర్థిక అసమానతలు తగ్గించడమే మా ప్రభుత్వ లక్ష్యం'' అని అన్నారు.

''పేదవాడు ఆకలితో ఉంటే సమాజానికి మంచిది కాదు. వారి జీవితాల్లో వెలుగులు తెచ్చేవరకు మీతోనే ఉంటా. కష్టపడి చదువుకుని పైకి వచ్చినవారు ఎంతోమంది ఉన్నారు. సరైన సమయంలో సరైన గైడెన్స్ ఉంటేనే జీవితంలో పైకి రాగలం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అనేక సేవలు అందుబాటులోకి తెచ్చాం. పనుల కోసం మీరు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. 2029 నాటికి పేదరికం లేని సమాజమే నా లక్ష్యం. ఆర్థిక అసమానతలను తగ్గిస్తాం. టెక్నాలజీ సరిగా వాడుకుంటేనే మనం ముందుకెళ్లగలం'' అన్నారు.

సైన్యానికి అండగా నిలబడదాం: చంద్రబాబు

శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీ నాయక్ వీర మరణం పట్ల సీఎం చంద్రబాబు సభలో రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మురళీ నాయక్ కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ''దేశాన్ని రక్షించగలిగిన సమర్థత ఉన్న నాయకుడు మోదీ ఒక్కరే. మన దేశం.. ఉగ్రవాదానికి ఎప్పటికీ వ్యతిరేకం. ప్రజాస్వామ్యంలో ఉగ్రవాదానికి స్థానం లేదు. ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటులేదని మోదీ ఏనాడో చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను మట్టుబెట్టిన ప్రభుత్వం కేంద్రంలో ఉంది. సరిహద్దుల్లో పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. దేశానికి సేవ చేసేందుకు యువత సైన్యంలో చేరుతున్నారు. సైన్యానికి మనమంతా అండగా ఉంటూ.. వారి పోరాటానికి మద్దతు ఇవ్వాలి'' అని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భద్రత కట్టుదిట్టం



విశ్వంభర, హైదరాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. సీఐఎస్ఎఫ్ బలగాల పర్యవేక్షణను పెంచారు. 24 గంటల పాటు డేగ కళ్లతో విమానాశ్రయానికి భద్రత కల్పిస్తున్నారు. స్థానిక శాంతి భద్రతల విభాగం, ఇంటెలిజెన్స్, ఎస్‌బీ పోలీసుల సమన్వయంతో విమానాశ్రయానికి భద్రత కల్పించారు. విమానాశ్రయం చుట్టూ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ప్రయాణికులు 3 గంటల ముందే విమానాశ్రయానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశాలతో ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి శ్రీనగర్, అమృత్‌సర్, జోధ్‌పూర్, చండీగఢ్, రాజ్‌కోట్ వెళ్లే విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు.

బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలి

విశ్వంభర, నేషనల్ బ్యూరో : భారత్ పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో.. బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. వినియోగదారులు, వ్యాపారాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బంది కలగకుండా చూడాలని, అంతరాయం లేని సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ భద్రత సన్నద్ధతపై బ్యాంకులు, ఆర్బీఐ, ఎన్‌పీసీఐ, బీమా సంస్థల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో నిర్మలా సీతారామన్ ఈ మేరకు సూచనలు చేశారు. సవాళ్లతో కూడిన సమయంలో ఆర్థిక స్థిరత్వాన్ని నిర్ధరించడంలో బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల పాత్ర కీలకమని పేర్కొన్నారు.'కార్యాలయాలతోపాటు డిజిటల్ విధానంలో బ్యాంకింగ్ కార్యకలాపాలు ఎటువంటి అంతరాయాలు లేకుండా సాగేలా చర్యలు తీసుకోవాలి. ఏటీఎంలలో నగదు అందుబాటులో ఉంచాలి. యూపీఐ సేవలు సజావుగా సాగేలా జాగ్రత్త వహించాలి. ఆకస్మిక పరిస్థితులను ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలి. దేశ సరిహద్దు ప్రాంతాల్లోని శాఖల్లో విధులు నిర్వహిస్తున్న బ్యాంకు ఉద్యోగులు, వారి కుటుంబాల భద్రతకు చొరవ చూపాలి. ఈ విషయంలో భద్రతా ఏజెన్సీలతో సమన్వయం చేసుకోవాలి'' అని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకుల ప్రతినిధులను ఆదేశించారని కేంద్ర ఆర్థికశాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

పాక్‌కు మళ్లీ భంగపాటు

(మొదటి పేజీ తరువాయి)

సాంబా, రాజౌరీ, పంజాబ్‌లోని పఠాన్‌కోట్, అమృత్‌సర్, రాజస్థాన్‌లోని పోఖ్రాన్ వద్దకు వచ్చిన పాక్ డ్రోన్లను భారత సైన్యం కూల్చివేసింది. జమ్ములో గంట వ్యవధిలో వంద వరకు డ్రోన్లను కూల్చివేసినట్టు రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. అవంతిపురా ఎయిర్‌బేస్ వద్ద, దక్షిణ కశ్మీర్‌లో పేలుళ్ల శబ్దాలు వినిపించినట్టు పేర్కొన్నాయి. మన గగనతల రక్షణ వ్యవస్థ శత్రుదేశపు డ్రోన్లను ఢీకొన్నప్పుడు ఆ పేలుడు శబ్దం వెలువడినట్టు వివరించాయి. ఉధంపూర్‌లో కూడా డ్రోన్లను కూల్చివేశామని వెల్లడించాయి. శ్రీనగర్‌లోని ఓ మసీదు లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రజలను బయటకు రావొద్దని, దీపాలు వెలిగించవద్దని హెచ్చరించారు. అమృత్‌సర్‌లో కూడా డ్రోన్లతోపాటు క్షిపణులను అడ్డుకొన్నామని రక్షణ శాఖ అధికారులు తెలిపారు.

రాజస్థాన్‌లో పదుల సంఖ్యలో డ్రోన్లు

రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో పాక్ పదుల సంఖ్యలో ప్రయోగించిన డ్రోన్లను భారత్ కూల్చివేసింది. డ్రోన్ల దాడి నేపథ్యంలో అధికారులు సరిహద్దు జిల్లాల్లో రెడ్ అలర్ట్, బ్లాక్‌అవుట్ ప్రకటించారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. డ్రోన్లు కనిపించగానే జైసల్మేర్, పోఖ్రాన్‌తోపాటు పలు పట్టణాల్లో సైరన్లు మోగాయి. ముందుగా అర్ధరాత్రి నుంచి బ్లాక్‌అవుట్ ఉంటుందని ప్రకటించినప్పటికీ డ్రోన్లు కనిపించగానే రాత్రి 9.00 గంటలకే విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు.

పేలుళ్ల శబ్దం వినిపించింది: ఒమర్ అబ్దుల్లా

జమ్ములోని పలు ప్రాంతాల నుంచి పేలుళ్ల శబ్దం వినిపించిందని జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావద్దని, వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి ఆధారాలు లేకుండా తమకు తెలిసిన సమాచారాన్ని ఇతరులకు పంపించవద్దని కోరారు.

పంజాబ్‌లోని 4 జిల్లాలలో బ్లాక్ అవుట్..

ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, అమృత్‌సర్, హోషియార్‌పూర్‌తోసహా పంజాబ్‌లోని అనేక ప్రాంతాలలో శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం విద్యుత్తు సరఫరాను పూర్తిగా నిలిపివేసి బ్లాక్‌అవుట్ విధించింది. పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్ జిల్లాలలో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, అమృత్‌సర్, హోషియార్‌పూర్ జిల్లాలలో వైమానిక దాడులు జరగవచ్చన్న హెచ్చరికగా సైరన్లు మోగించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. కాగా, జమ్ము, పఠాన్‌కోట్‌తోసహా వివిధ ప్రదేశాలలోని సైనిక స్థావరాలపై దాడులు చేసేందుకు గురువారం రాత్రి పాకిస్థాన్ చేసిన ప్రయత్నాన్ని భారతీయ దళాలు భగ్నం చేశాయి.

తీవ్ర ఉద్రిక్తతల వేళ..
ప్రధాని మోడీ వరుస సమీక్షలు..

పరిస్థితులు మరింత తీవ్రతరమవుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. తాజాగా విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్‌తో తన నివాసంలో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ఢోబాల్, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీలు కూడా సమావేశంలో పాల్గొన్నారు.అంతకుముందు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, త్రివిధ దళాధిపతులతో ప్రధాని మోదీ భేటీ నిర్వహించారు. ఈ భేటీకి ముందు బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, హోంశాఖలోని సీనియర్ అధికారులతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమావేశమయ్యారు. సరిహద్దుల్లో, విమానాశ్రయాల్లో భద్రతా ఏర్పాట్లను ఆయన సమీక్షించారు.

డీలిమిటేషన్‌కు మేం వ్యతిరేకం కాదు..

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు, అనుసరిస్తున్న విధానాలు దేశానికి దిశానిర్దేశం చేస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. సామాజిక న్యాయంతో పాటు ఇతర అంశాల్లో తెలంగాణ మోడల్ ను కేంద్ర ప్రభుత్వం కూడా అనుసరించాల్సిన పరిస్థితి ఉందన్నారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు ప్రశ్నలకు విడమరిచి సీఎం రేవంత్ సమాధానాలిచ్చారు. పెట్టుబడుల కోసం ప్రపంచ దేశాలు చైనా ప్లస్ వన్.. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో దానిని అందిపుచ్చుకోవాలన్న ఆలోచనతో అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు అభివృద్ధి ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని వాటిని సమగ్రంగా తెలియజేశారు. "మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ ప్రభుత్వం విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పనా రంగాలపై దృష్టి సారించింది. అందులో భాగంగా అనేక వినూత్న ప్రణాళికలకు శ్రీకారం చుట్టాం. ప్రపంచ దేశాల్లోని అగ్రగామి నగరాలతో పోటీ పడాలన్నదే తమ ఆలోచన. అందులో భాగంగానే నెట్ జీరో సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశాం. దేశంలోనే మొట్టమొదటిదిగా ఫ్యూచర్ సిటీకి రూపకల్పన చేశాం. ఎలక్ట్రిక్ వాహనాలపై పన్ను రద్దు చేశాం. 360 కి.మీ మేరకు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించడమే కాకుండా తెలంగాణలో ప్రాంతాల వారిగా పారిశ్రామికీకరణకు సన్నద్ధమయ్యాం. రీజినల్ రింగ్ రోడ్డు లోపలి పరిధిలో పారిశ్రామిక పార్కులు, ఐటీ, ఎలక్ట్రిక్ వాహనాలు, ఆటోమొబైల్ ఇండస్ట్రీ, ఇతర పరిశ్రమలను ఆకర్షించే విధంగా మౌలిక సదుపాయాల కల్పించాలన్నదే ప్రయత్నం. డ్రైపోర్టు నిర్మాణం వంటి అనేక ప్రణాళికలకు రూపకల్పన చేశాం. రాష్ట్రానికి 2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సాధించాం. ఇవన్నీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చుతాయి. మా ప్రభుత్వం సహేతుకమైన ప్రణాళికలతో పెట్టుబడులను ఆకర్షించేందుకు, పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, ఇతర రంగాలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుంది.

ప్రతి అంశాన్ని అందిపుచ్చుకుంటూ ముందుకు వెళ్లాలన్నదే ప్రయత్నం. ఇటీవల జపాన్ దేశ పర్యటన సందర్భంగా తెలుసుకున్న విషయాల మేరకు ఆ దేశానికి అవసరమైన మానవ వనరులను సమకూర్చడానికి వీలుగా తెలంగాణలో జపనీస్ భాషను నేర్పించాలని సంకల్పించాం. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య ఉద్యోగ, రాజకీయ సర్వే దేశానికి ఒక మోడల్‌గా నిలిచింది. ఈ సర్వే సమాజాన్ని మరింత సమర్థవంతంగా గుర్తించి సేవలు అందించడంలో దోహదపడుతుంది. ఇది కేవలం బీసీల కోసమే కాదు. ఈ సర్వే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ ప్రజలకూ ఉపయోగపడుతుంది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు తెలంగాణ ముందడుగు వేసింది. కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ మాడల్‌ను అమలు చేయాలి. ఈ రకంగా అనేక కోణాల్లో తెలంగాణ రైజింగ్ మొదలైంది. తెలంగాణలోని వేర్వేరు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఐసొలేషన్ గా సాగుతున్న విద్యను ఇంటిగ్రేట్ చేయడం ద్వారా పిల్లల్లో సోషలైజేషన్ ప్రక్రియకు చేపట్టాం. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఒక కీలకమైన నిర్ణయం.

జనాభాలో దాదాపు 60 శాతమున్న వ్యవసాయ కుటుంబాలకు అండగా ఉండేందుకు అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే రాష్ట్రంలో 25 లక్షలకు పైగా రైతులకు 21,617 కోట్ల రూపాయల మేరకు రుణమాఫీ చేశాం. రైతులకు ఏటా 12 వేలు ఇన్‌పుట్ సబ్సిడీగా ఇస్తున్నాం. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. దేశంలోనే అత్యధికంగా వరి ఉత్పత్తి చేసే రాష్ట్రం కనీస మద్దతు ధరతో పాటు క్వింటాల్ కు రూ. 500 బోనస్ చెల్లిస్తున్నాం. అలాగే 67 లక్షల సభ్యులున్న స్వయం సహాయక సంఘాల మహిళలకు వెయ్యి మెగావాట్ల సోలార్ ఉత్పత్తిని అవకాశం, పాఠశాలల నిర్వహణ, యూనిఫామ్ వంటి బాధ్యతలన్నీ వారికే అప్పగించాం. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం.

అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 59 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. నిరుద్యోగ యువతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ అనేక నిర్ణయాలు తీసుకున్నాం. స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, టాటా టెక్నాలజీస్ సహకారంతో రాష్ట్రంలోని 105 ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతున్నాం. ఇవన్నీ యువతకు ఉద్యోగ అవకాశాలు, ఉపాధి మార్గాలను చూపించడంలో భాగంగా చేపట్టాం. డీలిమిటేషన్‌కు మేం వ్యతిరేకం కాదు. కానీ ముందు కేంద్ర ప్రభుత్వం ఆ ప్రక్రియకు సంబంధించి అన్ని పార్టీలతో సంప్రదింపులు జరిపి అందుకు ప్రాతిపదికను స్పష్టంగా వెల్లడించాలి. అన్ని రాష్ట్రాలకు సమన్యాయం కావాలన్నదే మా డిమాండ్. అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాలను శిక్షించకూడదు. ఇది సామాజిక, రాజకీయ న్యాయానికి సంబంధించిన అంశం. అందుకే చర్చ జరగాలని అడుగుతున్నాం" అని అన్నారు.

ఈ కార్యక్రమంలో తొలుత ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "మొదటగా నేను భారతీయ సైన్యానికి సెల్యూట్ చేస్తున్నాను. దేశాన్ని రక్షించడంలో అహర్నిశలు కృషి చేస్తున్నారు. దేశ రక్షణ కోసం నిరంతరం కాపలాకాస్తోంది. ఈ సమయంలో అందరం సైనికులకు మద్దతు తెలపాలి" అని పిలుపునిచ్చారు.

అర్హులైన
జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

విశ్వంభర, హైదరాబాద్: అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలైన జర్నలిస్టులకు అలాగే వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని తెలిపారు.వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలసరి పెన్షన్, తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు శుక్రవారం నాడు నాంపల్లి లోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండల, నియోజకవర్గ స్థాయిలో పని చేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మంచిని మంచిగా, నిజాన్ని నిర్భయంగా సమాజనికి తెలియజేసే దాంట్లో ఎంతో మంది జర్నలిస్టులు ఆణిముత్యాలుగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. జర్నలిస్టు వృత్తిని నమ్ముకుని తన జీవితం మొత్తం ఆ వృత్తికే అంకితం అయినవాళ్ళు ఎంతోమంది ఉన్నారని అన్నారు. ఆనాటి ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనాన్ని చిన్న చిన్న మరమత్తులు పూర్తి చేసుకుని ఈ నెల చివరిలోగా ప్రారంభిస్తామని తెలిపారు.విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42.00 కోట్లను ఫీక్సడ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమి ఖర్చు పెడుతుందని. జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్డ్ డిపాజిట్ పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు రూ.22 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ.1,00,000/తో పాటు అయిదు సంవత్సరాల వరకు, నెలకు రూ.3000/ల చొప్పున పెన్షన్, వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల క్రింద 1 నుండి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు నెలకు 1,000/ల చొప్పున గరిష్టంగా ఇద్దరికి అందించడం జరుగుతుంది. ఇప్పటి వరకు ఈ ఖాతాలో మొత్తం రూ.8,98,39,000/లు ఆర్థిక సహాయం అందించండం జరిగిందన్నారు.ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి మాట్లాడుతూ ఈ సమాజంలో జర్నలిస్టు వృత్తి అత్యంత కీలకమైనదని తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్నారని గడిచిన రెండు రోజులుగా రెండు దేశాల మధ్య ఏం జరుగుతుందో అన్న ఆతృతతో ఎదురుచూస్తున్న ప్రజలకు తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నారని కొనియాడారు. ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

నేను మళ్లీ సైన్యంలో చేరడానికి సిద్ధం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : భారత్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన వేళ తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. తాను 16 ఏళ్లకే సైన్యంలో చేరానని గుర్తుచేశారు. మిగ్ 21 ఫైటర్ జెట్ పైలట్‌గా పనిచేశానని చెప్పుకొచ్చారు. భారత్ పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చుతోన్న వేళ మాజీ సైనికుల సేవలు అవసరమని పిలుపు వస్తే మరోసారి సైన్యంలో చేరడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. అంతేకాదు.. పీవోకేను భారత్ సంపూర్ణంగా స్వాధీనం చేసుకుంటే తప్ప ఈ సమస్య పరిష్కారం కాదని అన్నారు. పాకిస్తాన్ సృష్టించిన ఉగ్రవాదులే ఆ దేశానికి సంకటంగా మారారని కీలక వ్యాఖ్యలు చేశారు. తాజా పరిణామాలు చూస్తుంటే పాకిస్తాన్ రెండు అవ్వడం ఖాయంగా కనిపిస్తోందని హాట్ కామెంట్స్ చేశారు.పహల్గామ్ లో జరిగిన అమానవీయ ఉగ్రదాడి ఆధునిక ప్రపంచంలో జీవిస్తున్న ప్రతీ ఒక్కరినీ దిగ్భ్రాంతికి గురిచేసిందని చెప్పారు. అలాగే భారత ఆర్మీ ఉగ్రవాద శిభిరాలపై దాడులు చేయడం చాలా సమర్థనీయం అని అన్నారు. అంతేగాక పాక్ ఆక్రమిత కశ్మీర్, పాకిస్థాన్ లోని ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసి భారత సాయుధ దళాలు మంచి పని చేశాయన్నారు. ప్రస్తుతం ఉద్రిక్తత స్థిరంగా కొనసాగుతోందని, ఉద్రిక్తతలు తారా స్థాయికి చేరితే పూర్తి స్థాయి యుద్ధానికి దారి తీస్తుందని వెల్లడించారు. ఈ పరిస్థితులు పాకిస్థాన్ ని నాశనం చేయడానికి దారి తీస్తాయని స్పష్టం చేశారు. అంతేగాక పాకిస్థాన్ మన దేశంలో ఒక జిల్లాగా కూడా ఉంటుందని తాను అనుకోవడం లేదని, కాబట్టి పాకిస్థాన్ వెనక్కి తగ్గడం తెలివైన పని అని మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యానించారు.

మిస్ వరల్డ్ పోటీలను వాయిదా వేయాలి

విశ్వంభర, హైదరాబాద్ : రాష్ట్రంలో నిర్వహించనున్న మిస్ వరల్డ్ పోటీలను వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. దేశంలో యుద్ధ వాతావరణంలో నెలకొన్న ఈ సమయంలో అందాల పోటీలు నిర్వహించడం సరికాదని, ఐపీఎల్ ను వాయిదా వేసినట్లుగా మిస్ వరల్డ్ పోటీలను కూడా వాయిదా వేయాలని సూచించారు. దేశంలో యుద్ధ వాతావరణ నెలకొంటే దేశంలో అందాల పోటీలు పెట్టారన్న అపవాదు తెలంగాణకు వస్తుందని అన్నారు. ఇది విజ్ఞత ప్రదర్శించాల్సిన సమయమని, తప్పుడు సంకేతాలకు తావునివ్వకూడదని అభిప్రాయపడ్డారు. ఆపరేషన్ సిందూర్ కు మద్ధతుగా, భారత సైన్యానికి సంఘీభావంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరా పార్కు నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు జరిగిన భారీ ర్యాలీకి ఎమ్మెల్సీ కవిత నాయకత్వం వహించారు. సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో పాకిస్తాన్ చేసిన దాడుల్లో వీరమరణం పొందిన సైనికుడు మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ లోని 9 ఉగ్రవాద స్థావరాలను దిగ్విజయంగా భారత సైన్యం ధ్వంసం చేసిందని ప్రశంసించారు. సైన్యం వల్ల మనకు రక్షణ కలుగుతుందని, కాబట్టి వారికి ధైర్యం, స్థైర్యాన్ని నింపడానికి ర్యాలీ చేశామని చెప్పారు. పాకిస్తాన్ మన దేశంలోని ఎయిర్ పోర్టులను టార్గెట్ చేసుకొని చేసిన దాడులకు భారత సైన్యం గట్టిగా తిప్పికొట్టిందని తెలిపారు. అన్ని జిల్లాల్లో ఇలాంటి ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు."ఇది ధర్మయుద్ధం. భారత్ ఎప్పుడూ తప్పు చేయదు. నీతి, నిజాయితీతోనే యుద్ధం చేస్తున్నాం. మనం పాకిస్తాన్ భూభాగంలోని సామాన్య ప్రజలను ఏమి అనలేదు. కేవలం ఉగ్రవాద స్థావరాలనే ధ్వంసం చేశాము." అని వ్యాఖ్యానించారు. మరోవైపు, విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు ఎమ్మెల్సీ కవిత సమాధానమిస్తూ.... ముఖ్యమంత్రికి రాష్ట్ర ఆదాయాన్ని పెంచడం రాకపోతే, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే పరిస్థితి లేనప్పుడు పదవి నుంచి తప్పుకోవాలని సూచించారు. పరిపాలన చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులైన, ప్రజలైనా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీలనే అమలు చేయాలని అడుగుతున్నారని, కానీ గొంతెమ్మ కోరికలు కోరడం లేదని స్పష్టం చేశారు. అన్నారు. ముఖ్యమంత్రి ఎప్పుడు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని, రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చే విధంగా సీఎం మాట్లాడడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని విమర్శించారు.